అప్రమత్తతే రక్ష

- పాముల కాలం.. జర పైలం
- కాటేస్తే ప్రథమ చికిత్స తప్పనిసరి
- ఆందోళనకు గురైతే గుండెపోటు
- మూఢనమ్మకాలు వద్దు
- ప్రభుత్వ దవాఖానల్లో అందుబాటులో మందులు

అసలే వర్షాకాలం.. ఆపై ముమ్మరంగా కొనసాగుతున్న వ్యవసాయ పనులు.. దీనికి తోడు ఇది పాముల కాలం.. వెరసి రైతన్నలకు విషసర్పాలతో పొంచి ఉన్న ప్రమాదం.. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు, సూచనలతో పాటుగా అప్రమత్తతే రైతులకు శ్రీరామరక్ష కానున్నది. వర్షాకాలంలో వ్యవసాయ పనుల్లో తలమునకలైన రైతులు గతంలో పాము కాటుకు గురై తమ నిండు ప్రాణాలను కోల్పోయారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు గిరిజన తండాల్లో ఇలాంటి ఘటనలు అధికంగా చోటుచేసుకుంటాయి. గతంలో ఆధునిక వైద్యం అందుబాటులో లేకపోవడంతో నాటు వైద్యాన్ని, మంత్రాలు, ఆకురసం, చెట్ల మందులను ఆశ్రయించి మూఢ నమ్మకాలపై విశ్వాసంతో ప్రాణాలు విడిచేవారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ దవాఖానల్లో పాము కాటు మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రమాదవశాత్తు పాము కాటుకు గురైన వెంటనే బాధితుడిని సకాలంలో దవాఖానకు తరలిస్తే అతడి ప్రాణాలను కాపాడవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

- యాచారం, జూన్ 23

జూన్ నుంచి సెప్టెంబర్ వరకు పాములతో పాటు ఇతర విష కీటకాలు తమ ఆవాసాలను విడిచి బయట సంచరిస్తాయి. ధాన్యపు గాదెలు, గడ్డివాములు, చెట్ల పొదలు, రాళ్ల కుప్పలు, పొలంగట్ల వద్ద ఉన్న రంధ్రాల వద్ద ఎలుకలు, తడిగా ఉన్న ప్రాంతాల్లో కప్పలు అధికంగా తిరుగుతుంటాయి. వాటిని తినడానికి కట్ల పాము, నాగుపాము, రక్త పింజర, జెర్రిపోతు, నీరుకట్ట తదితర పాములు అధికంగా సంచరిస్తాయి. వర్షపు నీటితో పుట్టలు నిండటంతోపాటు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి చల్లటి గాలలుకు అవి బయటకు వస్తాయి. ఆహారం తినడానికి బయటికి వచ్చిన సమయంలో మనుషులు ఎదురైతే అవి దాడి చేసి కాటేస్తాయి. పొలాల వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నప్పుడు రైతులు, కూలీలు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. దుంగలు, కర్రలు, రాళ్లు కదిలించేటప్పుడు జాగ్రత్తగా వహించాలి. అక్కడ పాములతో పాటుగా తేళ్లు, జెర్రులు ఉండి రైతులను కాటేసే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు తప్పనిసరి

వర్షాకాలంలో విష సర్పాల నుంచి రక్షణ పొందడానికి పొలాల వద్ద పరిశుభ్రతను పాటించాలి. చెత్తాచెదారం, రాళ్లు రప్పలు, ముళ్ల పొదలు, రంధ్రాలు లేకుండా చూసుకోవాలి. ఇంటి పరిసరాల వద్ద, పశువుల పాకల వద్ద ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి చుట్టుముట్టు గడ్డి లేకుండా చూసుకోవాలి. చీమలు పుట్టలు, రంధ్రాలుంటే వాటిని మూసివేయాలి. లేదంటే వాటి ద్వారా పాములు ఇండ్లలోకి వచ్చే ప్రమాదముంది. ఎప్పుడూ చీకటి కాకుండా తరచూ వెలుగు ఉండేలా చూసుకోవాలి. చీకట్లో వెలుతురు లేకుండా బయటకు వెళ్లడం మంచిది కాదు. బయటకు వెళ్తే పాదరక్షలు తప్పకుండా వేసుకోవాలి. పొలం గట్ల వద్ద నడుస్తుంటే చెప్పులు వేసుకొని టార్చిలైట్ వేసుకొని కర్రను చప్పుడు చేసుకుంటూ వెళ్లాలి. శబ్దంతో పాములు పక్కకు జరిగే అవకాశాలున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

పాము కాటుకు గురికాకుండా రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా పాము కాటు వేస్తే ఎలాంటి ఆందోళన చెందవద్దు. పాము కాటుతో భయాందోళనకు గురైతే గుండెపోటు వచ్చి ప్రాణాలకే ప్రమాదం ఉంటుంది. బాధితుడి నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. పాము కాటును నిర్లక్ష్యం చేయవద్దు. మూఢనమ్మకాలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. పాము కాటు వేసిన వెంటనే వైద్యుడిని ఆశ్రయించి చికిత్స పొందాలి. పాము కాటు వేయగానే ప్రథమ చికిత్స ఎంతో అవసరం. సకాలంలో బాధితుడిని దవాఖానకు తీసుకొస్తే ప్రమాదం తప్పుతుంది. ముఖ్యంగా వీలైతే ఏ పాము కరిచిందో చెప్పడం లేదా దానిని చంపి దవాఖానకు తీసుకొస్తే మెరుగైన వైద్యం అందించవచ్చు. పాము కాటుకు ప్రభుత్వ దవాఖానల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- రాజ్యలక్ష్మి, మండల వైద్యాధికారిణి, యాచారం

నాటు వైద్యం వద్దు.. ప్రథమ చికిత్స మేలు

పొలాల వద్ద పాములు కాటేస్తే తేలికగా తీసుకుంటే ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంటుంది. ముఖ్యంగా నాటు వైద్యాన్ని నమ్ముకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. పాతకాలం మాదిరిగా పాము కరిచిన చోట చెట్ల మందులు, ఆకు రసాలు, మంత్రాలు వేయడం మానుకోవాలి. ముఖ్యంగా పాము కరవగానే ఆందోళన చెందకూడదు. దీంతో గుండెపోటు వచ్చే అవకాశాలున్నాయి. పాము కరువగానే ప్రాథమిక చర్యగా పాము కరిచిన పైభాగంలో తాడుతో, గుడ్డతో కట్టుకట్టాలి. కరిచిన చోట పొటాషియం పర్మాంగనేట్‌తో కడిగి ఆ భాగంలో ఉన్న రక్తాన్ని పిండి బయటకు తీసి శుభ్రం చేయాలి. గాయం వద్ద వేడి నీటిని పోయడంతో కొంత మేర విషం బయటకు పోతుంది. అనంతరం పాము కరిచిన చోట పటిక ముక్కను ఉంచాలి.

పాము కాటుకు గురైన వ్యక్తి శ్వాసను కోల్పోతే కృత్రిమ శ్వాసను అందించాలి. బాధితుడికి వేడినీళ్లు, కాఫీ, పాలు తాగించాలి. వెంటనే చికిత్స కోసం వీలైనంత త్వరగా దవాఖానకు చేరుకోవాలి. రైతుకు ఏ పాము కరిచిందో స్పష్టంగా చెబితే దానికి తగ్గట్టుగా సరైన వైద్యాన్ని అందించడంతో ప్రమాదం నుంచి ప్రాణాలను త్వరగా కాపాడుకోవచ్చు. పాము కరిచిన చోట రెండు బలమైన కాట్లు పడితే అది విషసర్పంగా గుర్తించాలి. కట్ల పాము కరిస్తే క్షణాల్లోనే విషం రక్త కణాల్లోకి చేరుకుంటుంది. నాగుపాము కరిస్తే 15 నిమిషాల లోపే విషం శరీరంలోకి చేరుతుంది. 15-20 నిమిషాల్లో దవాఖానకు వెళ్లాలి లేదంటే ప్రాణాలకు ప్రమాదం సంభవించవచ్చును. రక్త పింజర కాటేసిన రెండు గంటల తరువాత విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది. జెర్రిపోతు, నీరుకట్ట పాములతో పెద్దగా ప్రమాదం లేకపోయినా చికిత్సమాత్రం తప్పనిసరిగా చేయించుకోవాలి. పాము కరువగానే కొన్ని ఆకుల రసాలు పిండి పోస్తారు. ఇది అంత మంచిది కాదని, ఏదేమైనా దవాఖానలో తప్పనిసరిగా చికిత్స చేయించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. దవాఖానలో యాంటీ వీనమ్ సిరం, యాంటి బయాటిక్స్ ఇంజక్షన్‌లు వేయించాలని పేర్కొంటున్నారు.



పీడీ, పీఈటీల సంఘం జిల్లా నాయకులు బాబయ్య, మహ్మద్ సాబేర్ ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌లో భాగంగా జిల్లాలో కూడా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, జిల్లా ఉపాధ్యాయులకు అన్యాయం జరుగకుండా చూడాలని కోరుతూ సీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా హైస్కూళ్లలో మిగతా ఉపాధ్యాయుల కంటే తక్కువ హోదా, తక్కువ జీతానికి పని చేస్తున్న పీడీ, పీఈటీలను గుర్తించి వారికి స్కూల్ అసిస్టెంట్ పీడీలుగా గుర్తించినందుకు వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. - యాచారం, జూన్ 23

మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు

షాబాద్, జూన్ 23 : తెలంగాణ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలో విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వెంకటేశం, కమిషనర్ దేవసేన, గౌరవ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వారి నివాసంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పటి నుంచి జీవో 254 ప్రకారం ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నామని.. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు మినిమం టైమ్ స్కేల్ ఇస్తున్నారని, అదే విధంగా తెలంగాణలో కూడా ఇంప్లిమెంటేషన్ చేయాలని కోరారు.



బంట్వారానికి చెందిన కొండిగారి చంద్రయ్య అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స (ఆపరేషన్) కోసం రూ.2లక్షల30వేల ఎల్‌వోసీని ఆదివారం ఆయన కుటుంబసభ్యులకు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ - మర్పల్లి, జూన్ 23

తెలంగాణ రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంప్ దినేశ్‌సింగ్

రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంప్ విజేతలతో రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హంజా బీన్ ఒమర్, హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి నాసిర్ ఖలీఫా

హైదరాబాద్, ఆట ప్రతినిధి జూన్ 23: తెలంగాణ రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ టైటిల్‌ను టి.దినేశ్‌సింగ్ కైవసం చేసుకున్నారు. యాఖుత్‌పురాలోని అలి వస్తాదా హకాడలో ఆదివారం జరిగిన ఫ్రీ స్టైల్ రెజ్లింగ్ ఫైనల్స్‌లో దినేష్ సింగ్ 13-5 పాయింట్ల తేడాతో శ్రీనివాస్‌పై విజయం సాధించారు. గ్రీక్ రోమన్ స్టైల్ రెజ్లింగ్ ఫైనల్స్‌లో ఓమర్ 12-07 పాయింట్ల తేడాతో విజయ యాదవ్‌పై గెలుపొందారు. వినయ్ కుమార్, ఉదయ రాజ్, బి.దినేశ్, ఎస్కే షోయబ్, వెంకటరామణ, ఏ.శోభేశ్ విజేతలుగా నిలిచారు. విజేతలకు ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హంజా బీన్ ఒమర్, హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాసిర్ ఖలీఫా, లింగం పల్వాన్, స్యూరి, సానీ బహుమతులు అందజేశారు.

తెలుగు భాషా పరిరక్షణ అభినందనీయం

అవార్డు గ్రహీతలతో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, బడే సాబ్

రవీంద్రభారతి, జూన్ 23: తెలుగు భాషా పరిరక్షణ అనేది అభినందనీయమైన కార్యక్రమం అని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలుగు కవితా వైభవం (తెలుగు అభివృద్ధి సమితి), తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో 'తెలుగు కవితా వైభవం - దశాబ్ది ఉత్సవాలు, ఒక రోజు కవిరాణి - కవిరాజు, తెలుగు బంధు బిరుదులు' ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య కొలకలూరి ఇనాక్, విశిష్ట అతిథిగా పూర్వ రిజిస్ట్రార్ డా.బి.గౌరీశంకర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ, ఇంతమంది కవులు తెలుగు భాష గురించి, భాష పరిరక్షణ గురించి మాట్లాడటం ఎంతో అభినందనీయమన్నారు. 'తెలుగు భాష పరిరక్షణ' అనే సంకల్పం చాలా గొప్పది. గత ఐదేండ్లుగా తెలుగు భాష కుంటుబడి పోయింది. తెలుగు భాష పరిరక్షణకు కవులు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభా అధ్యక్షుడిగా మేక రవీంద్ర వ్యవహరించగా, కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు టి.కిషన్ రావు, ప్రొఫెసర్ నాళేశ్వరం శంకరం, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తెలుగు భాషా చైతన్య సమితి చైర్మన్ బడే సాబ్, దాసోజు పద్మావతి పాల్గొన్నారు.

hmda
Growing Global

కొత్వాల్‌గూడకు లింకు రోడ్డు

రూ.2.97 కోట్లతో హెచ్ఎండీఏ ప్రతిపాదనలు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): నగర శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు హెచ్ఎండీఏ ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తున్నది. గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సమీప గ్రామాలకు మెరుగైన రోడ్డు నెట్‌వర్క్ ఉండేలా చర్యలు చేపట్టింది. శంషాబాద్-రాజేంద్రనగర్ మధ్య ఉన్న ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు కొత్వాల్‌గూడ వరకు రూ.2.97 కోట్లతో హెచ్ఎండీఏ ప్రతిపాదనలు రూపొందించింది. ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డులోని చెన్నమ్మ హోటల్స్ నుంచి కొత్వాల్‌గూడ వైఆర్‌రెడ్డి హౌస్ వరకు లింకు రోడ్డు నిర్మాణం ద్వారా ఆ ప్రాంతవాసులకు మెరుగైన రోడ్డును అందుబాటులోకి తీసుకురానున్నారు.

నేటి నుంచి టీ-జూడాల నిరవధిక సమ్మె

సుల్తాన్‌బజార్, జూన్ 23 : జూనియర్ డాక్టర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు టీ-జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ శ్రీసాయి హర్ష పేర్కొన్నారు. ఆదివారం కోఠిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమ్మెలో జూడాలందరూ పాల్గొంటారని తెలిపారు. సమ్మెతో ఓపీ సేవలు, ఎలక్టివ్ సర్జరీలు, వార్డు డ్యూటీలను పూర్తిగా బహిష్కరిస్తున్నామన్నారు. జూడాల విధి నిర్వహణ పరిస్థితులు, వేతనాల మోతాదు, ఆరు నెలలుగా స్టైఫండ్ ఇవ్వకపోవడం, జూనియర్ డాక్టర్లకు రక్షణ, భద్రత వంటి అంశాల సమస్యలపై చర్చించినా పరిష్కారం లభించకపోవడంతో సమ్మె చేయనున్నామన్నారు.

సూపర్ మోసాలు !

కాలం చెల్లిన ప్యాకింగ్‌లు, ఆహార పదార్థాలు
డీ మార్ట్, బీ మార్ట్‌లపై టాస్క్‌ఫోర్స్ చర్యలు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : సూపర్‌మార్కెట్‌కు వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త...నాసిరకం ఫుడ్ ప్యాకెట్లు, ఎక్స్‌పైరీ డేట్ దాటిన ఉత్పత్తులు కస్టమర్లకు అంటగడుతున్నారు. అన్నీ ఒకే చోట లభిస్తాయి కదా అని వెళ్లిన వినియోగదారుడి అవసరాన్ని ఆసరాగా చేసుకొని నాణ్యత లేని ఆహార పదార్థాలను అంటగడుతున్నారు. కొన్ని రోజులుగా ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు హాస్టళ్లు, హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టగా తాజాగా సూపర్ మార్కెట్లపై దృష్టి సారించారు. వనస్థలిపురం డీ మార్ట్‌లో స్పైట్స్, బేబీ కార్న్, మష్‌రూమ్ వంటి న్యూట్రి వాలా బ్రాండ్స్ గడువు తీరినట్లు గుర్తించారు. తుర్కయాంజాల్‌లోని బీ పార్టు (బాలాజీ మార్ట్ ఎంటర్‌ప్రైజెస్)లో ఐదు కిలోల రాగి పిండి, 208 కిలోల ఇడ్లీ రవ్వ, ఉరద్ గోటా 150 కిలోలను స్వాధీనం చేసుకుని చర్యలు తీసుకున్నారు. మొత్తంగా సూపర్ మార్కెట్లలో కొనుగోలు చేసే ప్యాకింగ్ వస్తువులను చూసి కొనాలని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లలో కల్తీ, నకిలీ వస్తువులు విరివిరిగా దొరుకుతున్నాయి. తాగేనీరు, తినే పదార్థాల ప్యాకింగ్‌పై అవి తయారు చేసిన తేదీ, ఎప్పటి వరకు వాడొచ్చు, చిరునామా తదితర విషయాలను సరిచూసుకోవాలి. కొన్ని దుకాణాల్లో తేదీ దాటిన తర్వాత కూడా సంబంధిత వస్తువులను విక్రయిస్తుంటారు. అందువల్ల వినియోగదారుడు గమనించి కొంటే మంచిదని చెబుతున్నారు.

కత్తులతో స్నాచర్ల వీరంగం

- పోలీసులకు చిక్కకుండా పరారు
- సికింద్రాబాద్‌లో చోరీకి యత్నం
- స్నాచర్లపై పోలీసుల కాల్పులు.. ఇద్దరు అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : అర్ధరాత్రి సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసి పరారైన దొంగల ముఠాపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో స్నాచర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్నాచర్ల నుంచి మారణాయుధాలు, దొంగిలించిన బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ కథనం ప్రకారం.. ఫలక్‌నుమా, ముస్తఫానగర్‌కు చెందిన మసూద్ ఉర్ రహమాన్ వెల్డర్‌గా, క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విలాసాలకు తన సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాల బాట పట్టాడు. 2020లో ఈజీ మనీ కోసం ప్రయత్నించి దొంగతనాలు, స్నాచింగ్ చేయడంతో మైలార్‌దేవ్‌పల్లి, నాచారం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ నెల 20న తెల్లవారుజామున ముషీరాబాద్‌లోని తన బంధువు ఇంటికి వెళ్లాడు. అక్కడ స్క్రాప్ బిజినెస్ చేసే ఫజల్ ఉర్ రహమాన్‌ను కలిసి, తాను దోపిడీకి వెళ్తున్నానని తనతో రావాలని వెంట తీసుకెళ్లాడు. దోపిడీ చేసే సమయంలో ఎవరైనా అడ్డుకుంటే వాళ్లపై దాడి చేసేందుకు డాగర్, కత్తితో బయలుదేరారు. చాదర్‌ఘాట్ వైపు వెళ్లి స్వాగత్ బార్ వద్ద యాక్టివా వాహనాన్ని దొంగిలించి, అక్కడి నుంచి ముషీరాబాద్‌లోని బోలక్‌పూర్ స్టార్ హోటల్ వద్దకు చేరుకొని అక్కడ పార్కు చేశారు. తరువాత విక్రయించేందుకు ప్లాన్ చేశారు. అనంతరం తెల్లవారుజామున 2, 3 గంటల సమయంలో సికింద్రాబాద్ గణేశ్ ఆలయం సమీపంలో ఒక వ్యక్తి వెళ్తుండటంతో అతని నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కునేందుకు ప్రయత్నించడంతో బాధితుడు అడ్డుకున్నాడు. ఇద్దరు వాహనం దిగి తమ వద్ద ఉన్న కత్తులతో బాధితుడిని బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితుడు గట్టిగా అరుస్తుండటంతో యాంటీ స్నాచింగ్ కానిస్టేబుల్ అక్కడకు చేరుకొని దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. ఇంతలో బాటా షోరూం దగ్గర నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ లాక్కోవడానికి ప్రయత్నించారు. అక్కడి నుంచి మళ్లీ పరారై సిటీలైట్ హోటల్ వైపు పరిగెత్తుతుండటంతో వారిని వెంబడిస్తున్న కానిస్టేబుల్ తన గన్‌తో ప్రధాన నిందితుడి కాల్పులు జరిపాడు. అయినా నిందితులు పరారయ్యారు. పోలీసులు నిందితుల కోసం గాలించి 48 గంటల్లోనే అరెస్ట్ చేశారు.

'మూసీ' బ్రిడ్జీల నాణ్యత తనిఖీ

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : మూసీ నదిపై ఇప్పటికే ఉన్న బ్రిడ్జీల నాణ్యతను అధ్యయనం చేసేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఆర్‌డీసీఎల్) చర్యలు చేపట్టింది. గండిపేట నుంచి గౌరెల్లి ఔటర్ రింగు రోడ్డు దాకా పారుతున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సర్వేను అధికారులు పూర్తి చేశారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్) చేసి మూసీకి ఇరువైపులా సరిహద్దులను నిర్ణయిస్తున్నాయి. అదేవిధంగా మూసీ నదిపై ఇప్పటికే ఉన్న బ్రిడ్జీల నాణ్యతను అధ్యయనం చేసేందుకు ప్రత్యేకంగా ఇంజనీరింగ్ నిపుణులను నియమించనుంది. గండిపేట నుంచి గౌరెల్లి దాకా పారుతున్న మూసీ నదిపై ఇప్పటికే మొత్తం 17 బ్రిడ్జీలు ఉన్నాయని, వాటన్నింటినీ ప్రత్యేకంగా పరిశీలించి వాటి నాణ్యతపై నివేదిక ఇస్తారని అధికారులు తెలిపారు.

మూసీ నదిపై ఉన్న బ్రిడ్జీలు

- టిప్పుఖాన్ బ్రిడ్జి (పాతది)
- టిప్పుఖాన్ బ్రిడ్జి (కొత్తది)
- బాపూఘాట్ బ్రిడ్జి
- అత్తాపూర్ బ్రిడ్జి
- పురానాపూల్ (పాతది)
- పురానాపూల్ (కొత్తది)
- ముస్లింజంగ్ బ్రిడ్జి (పాతది)
- ముస్లింజంగ్ బ్రిడ్జి (కొత్తది)
- నయాపూల్ (పాతది)
- నయాపూల్ (కొత్తది)
- సాలార్‌జంగ్ బ్రిడ్జి
- చాదర్‌ఘాట్ బ్రిడ్జి
- గోల్నాక బ్రిడ్జి
- నాగోల్ బ్రిడ్జి (పాతది)
- నాగోల్ బ్రిడ్జి (కొత్తది)
- ఇమ్లీబన్ పార్కు (లోపలి వెళ్లేది)
- ఇమ్లీబన్ పార్కు (బయటకు వచ్చేది)

గిరిజనుల సంక్షేమానికి కృషి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



జటావత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ఆమనగల్లు, జూన్ 23 : గిరిజనుల సంక్షేమానికి జాతీయ ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ తెలిపారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలిచింతలపల్లికి చెందిన చెంచు మహిళలపై కౌలుదారుల దాడి నేపథ్యంలో ఆమెను పరామర్శించడానికి వెళ్తున్న హుస్సేన్‌నాయక్ కొద్ది సేపు ఆమనగల్లులో ఆగారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులై మొదటిసారిగా ఆమనగల్లుకు విచ్చేసిన ఆయనకు బీజేపీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి సత్కరించారు. బటర్‌పై వెంచర్ నిర్వాహకులు తమ భూములను ఆక్రమించి, ఇబ్బందులకు గురి చేస్తున్నారని మున్సిపాలిటీలోని పలువురు గిరిజన బాధితులు నేనావత్ బుజ్జి, నేనావత్ తౌర్య, నేనావత్ లచ్చు ఎస్టీ కమిషన్ సభ్యుడికి ఫిర్యాదు చేయగా.. ఈ సంఘటనపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్, రాష్ట్ర నాయకుడు కళ్యాణ్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహ, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, విక్రంరెడ్డి, కృష్ణానాయక్, సీనియర్ నాయకులు శ్రీశైలంయాదవ్, శ్రీధర్, సాయి, నేనావత్ నరేందర్ నాయక్, రవిరాథోడ్, పద్మ, శ్రీను, రవినాయక్ , నందు, బాలు, గోపి ఉన్నారు.

సీఎస్ఐఆర్ లాబొరేటరీస్‌లో వన్ వీక్.. వన్ థీమ్

నేటి నుంచి దేశవ్యాప్తంగా అమలు
హైదరాబాద్‌లో మూడు ప్రధాన లాబొరేటరీలు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) ఆధ్వర్యంలో నేటి నుంచి వన్ వీక్... వన్ థీమ్ కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. జూన్ 28 నుంచి డిసెంబర్ వరకు జరిగే ఈ వేడుకల్లో దేశంలోని అన్ని సీఎస్ఐఆర్ రీసెర్చ్ సెంటర్లను జనాలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగంపై జనాలకు అవగాహన కల్పించి, భావితరాలకు విజ్ఞానాన్ని అందించేలా ప్రతి ఏటా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. గతేడాది వన్ వీక్... వన్ ల్యాబ్ పేరిట రీసెర్చ్ సెంటర్లను సందర్శించే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించగా, రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈసారి వన్ వీక్... వన్ థీమ్ పేరిట నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. నేటి నుంచి మొదలై డిసెంబర్ 17 వరకు జరిగే వేడుకల్లో శక్తి వనరులు, రసాయన, పెట్రో కెమికల్స్, ఎయిరోస్పేస్, సివిల్ ఇన్‌ఫ్రా, అగ్రి, న్యూట్రిషన్-బయోటెక్, హెల్త్ కేర్, మైనింగ్, ఖనిజాలు, లోహాలు, పర్యావరణంతో కూడిన అంశాలకు సంబంధించిన వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలు, ఆయా లాబొరేటరీల్లో జరుగుతున్న ప్రయోగాలను ప్రదర్శించనున్నారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రధానమైన మూడు లాబొరేటరీలు పనిచేస్తున్నాయి. సీసీఎంబీ, ఎన్‌జీఆర్ఐ, ఐఐసీటీతో పాటు, సీఎఫ్‌టీఆర్ఐ అనుబంధ సెంటర్, ఎన్ఈఈఆర్ఐ సంస్థలు కూడా ఉన్నాయి.